క్లుప్తంగా

అభివృద్ధికి ఆమడ దూరంలో..

భద్రాచలంటౌన్: ఏజెన్సీ ఏరియాలో ఆదివాసీలు అభివృద్ధి, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ఆమడ దూరంలో ఉన్నారని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ అన్నారు. స్థానిక గోళ్ళగట్టు రోడ్డులో ఆదివారం జరిగిన ముఖ్య నాయకులు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆదివాసీలు రాజకీయ రిజర్వేషన్లలో వెనుకబాటుతనానికి గురవుతున్నారనే విషయం యావత్తు దేశంలోని ప్రజలకు తెలిసిన విషయమన్నారు. భద్రాచలం కేంద్రంగా ఒక న్యాయ కళాశాల మంజూరు చేయాలని గత కొంత కాలంగా గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు ఏమాత్రం ఆదివాసీల ఉద్యమాలను పరిగణలోకి తీసుకోవడం లేదని ఆరోపించారు. 5వ షెడ్యూల్ ఏరియాలలోని గత జీవో నెం.3కి అనుగుణంగా వంద శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31న భద్రాచలం ఐటీడీఏ ఎదుట నిర్వహించే ధర్నాకు అధిక సంఖ్యలో ఆదివాసీలు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇర్ప ప్రకాష్, యలగల చంద్రరావు, పూనెం వరప్రసాద్, సుధాకర్, రవీంద్ర, పాలెం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



రామాలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని ఊసిర్లగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతా సమేత కోదండ స్వామి, పరివార దేవత సమేత విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ నేపథ్యంలో గడిచిన మూడు రోజులుగా వేద పండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయంలో ప్రతిష్ఠాపన కార్యక్రమం తర్వాత భక్తులు ఆలయంలో స్వామి వార్లను దర్శించుకొని వివిధ రకాల పూజలు చేసి, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద మధ్యాహ్న సమయంలో అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బిర్రం వెంకటేశ్వరరావు, వగ్గెల పూజ, తాండ్ర యుగంధర్, వెంకన్న బాబు పాల్గొన్నారు.

20న రహదారి దిగ్బంధం

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక గ్రామం వద్ద ప్రధాన రహదారిపై కూలిపోయిన వంతెన నిర్మాణం తక్షణమే చేపట్టాలని ప్రధాన రహదారి మరమ్మతులు చేపట్టాలని ఈ నెల 20న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తూరుబాక వద్ద ప్రధాన రహదారి దిగ్బంధం చేపట్టనున్నట్టు ఆ పార్టీ మండల కన్వీనర్, కో కన్వీనర్ కణితి రాముడు, ఎండి.జానీపాషాలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గత ఏడాది ఆగష్టు నెలలో తూరుబాక దగ్గర కల్వర్టు కుంగిపోయి ప్రమాదకరంగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి.అయినా కానీ ప్రభుత్వం,అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.కల్వర్టు నిర్మాణం చేపట్టి రహదారి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీన నిర్వహించే రహదారి దిగ్బంధంలో అత్యధిక ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

కొవ్వొత్తులతో ర్యాలీ

మణుగూరురూరల్: జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి, ది గాడ్ థెరిస్సా మహిళా మండలి వారి సంయుక్త ఆధ్వర్యంలో ఎయిడ్స్ మహమ్మారి కారణంగా ప్రాణాలను కోల్పోయిన వారిని స్మరిస్తూ పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రతి సంవత్సరం మే మూడో ఆదివారం ప్రపంచ వ్యాప్తంగా చేపట్టే ఈ స్మరణ సందర్భంగా సిబ్బంది కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు.

కార్యక్రమంలో ది గాడ్ థెరిస్సా మహిళా మండలి సీఈఓ, మణుగూరు ఎన్జీవో, ప్రాజెక్ట్ మేనేజర్ వట్టి సాగర్‌రెడ్డి, జీఎస్ఎం రాణి, అవుట్‌రిచ్ వర్కర్ రజిని, సుజాత, నాగేంద్ర, మేరి, ప్రభావతి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా ప్రకాశ్‌రావు

అశ్వాపురం: టీడీపీ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన తుళ్లూరి ప్రకాశ్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర పరిశీలకుడు కొడాలి శ్రీనివాస్ సమక్షంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. నాయకులు, కార్యకర్తల ఏకాభిప్రాయంతో వరుసగా నాలుగో సారి ప్రకాష్‌రావు మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రావు మాట్లాడుతూ మండలంలో టీడీపీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

వికాసం రుణాలకు 'సిబిల్' కొర్రీ

- మంత్రుల వాదన ఒకటి.. బ్యాంకుల వివరణ మరొకటి
- అధికారుల్లోనూ లోపించిన సమన్వయం
- గందరగోళంలో లబ్ధిదారులు



బ్యాంక్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీఓ (ఫైల్)

భద్రాచలంటౌన్: తెలంగాణ రాష్ట్రంలో యువతకు ఆర్థిక చేయుతను అందించి, తద్వారా జీవనోపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రారంభించనున్న రాజీవ్ యువ వికాస్ పథకం ప్రారంభం దశలోనే విమర్శల పాలవుతోంది. ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న యువత పథకం ద్వారా లబ్ధి పొందాలంటే అధికారులకే పూర్తి స్థాయిలో తెలియని అనేక రకాల నిబంధనలు పెట్టారు.

భద్రాచలం మండల వ్యాప్తంగా 2004 మంది అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అందులో రూ.50 వేల వరకు 49, రూ.లక్ష వరకు 52 మంది, రూ.2లక్షల వరకు 219 మంది, రూ4లక్షల వరకు 1684 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ పథకం అమలులో పాలుపంచుకుంటున్న అధికారుల మధ్య సమన్వయ లోపంతో అబ్ధిదారులు గందరగోళానికి గురవుతున్నారు. అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్ధిదారుడికి పథకం వర్తించేలా చర్యలు తీసుకుంటామని తెలిపిన అధికారులు మధ్యలో బ్యాక్ అధికారులు ప్రవేశంలో కొత్త నిబంధన బ్యాంక్ సిబిల్ స్కోర్‌కు తెరలేపారు. దీంతో పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు లబోదిబో మంటూ తన సిబిల్ స్కోర్ తెలుసుకునేందుకు బ్యాంకులకు పరుగులు తీస్తున్నారు. కాగా, బ్యాంకు అధికారులు సైతం అది బయటకు చెప్పకూడని విషయమని చేతులు దులుపుకుంటున్నారు. దీంతో పథకతో లబ్ధి పొంది అభివృద్ధి చెందుదామని కోటి అశలు పెట్టుకున్న యువత ఎవరికి పథకం వర్తిస్తుందో తెలియక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పరిశీలన కమిటీల పర్యవేక్షణలో..

రాజీవ్ యువ వికాసం పథకాన్ని పూర్తి స్థాయిలో అర్హులైన వారికి అందజేయాలనే లక్ష్యంతో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కోసం ప్రతి మండలానికి పరిశీలన కమిటీలకు అధికారులు ఏర్పాటు చేశారు. లబ్ధిదారుల దరఖాస్తులను వారు క్షుణంగా పరిశీలించి ఆ తరువాత బ్యాంకు అధికారులకు అందజేస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారికి పథకం వర్తించేలా ఈ పరిశీలన కమిటీ సభ్యులు పనిచేస్తారు. కాని, వీరికి సైతం పూర్తి స్థాయిలో పథకానికి సంబంధించిన నియమ నిబంధనలు తెలియకపోవడం గమనార్హం. అధికారులు సైతం పథకం వర్తించేందుకు ఎటువంటి నిబంధనలు ఉండాలనే విషయంపై స్పష్టత లేదు.



మంత్రులు అలా.. అధికారులు ఇలా..

మంత్రులు, ప్రజా ప్రతినిధులు సిబిల్ స్కోర్‌తో పని లేకుండానే పథకం వస్తుందని చెబుతుంటే.. బ్యాంక్ అధికారులు మాత్రం సిబిల్ స్కోర్ పక్కాగా ఉంటేనే పథకం వర్తింపజేస్తామని కుండబద్దలు కొట్టినట్లు చెబుతున్నారు. ఇటీవలే ఇల్లెందు నియోజకవర్గంలో పర్యటించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాస్ పథకానికి ఎటువంటి సిబిల్ స్కోర్ అవసరం లేకుండా వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. జూన్ 2వ తేదీన ప్రారంభ కానున్న ఈ పథకానికి లబ్ధిదారులు అధికారుల ఇంటర్వ్యూలో పథకానికి అర్హులని తేలితే చాలు అని ఆయన పేర్కొన్నారు. కాగా, ఇప్పటికే అధికారులు మండలాల్లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను కులాల ఆధారంగా ఎంపిక చేసి లిస్టును బ్యాంకులకు పంపించారు. అక్కడ సిబిల్ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటారా.. లేదా అన్నది ప్రశ్న.

ప్రతి ఒక్కరికీ వర్తింపజేయాలి

రాజీవ్ యువ వికాసం పథకంపై యువత అనేక అశలు పెట్టుకుందని, ఎటువంటి నిబంధనలు లేకుండా ప్రతి ఒక్కరికి పథకం వర్తించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. యువత భవిష్యత్తుకు ఉపయోగపడే పథకాలకు ఆంక్షలు పెట్టకుండా అమలు చేయాలి.

– నాగేశ్వరరావు, లబ్ధిదారుడు, భద్రాచలం

సిబిల్ స్కోర్‌ను తొలగించాలి

నిరుద్యోగ యువతకు చేయుతను ఇచ్చే ఇటువంటి పథకాలకు బ్యాక్ అధికారులు తెలిపే సిబిల్ స్కోర్ సాకును తొలగించి అర్హులైన ప్రతి ఒక్కరికి పథకం వర్తించేలా చేయాలి. అధికారులు నిర్వహించిన ఇంటర్వ్యూ ఆధారంగానే లబ్ధిదారులను ఎంపిక చేయాలి.

– మహేష్, లబ్ధిదారుడు, భద్రాచలం

ఉపాధి కల్పనే లక్ష్యం

రాజీవ్ యువ వికాసం పథకం నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యంగా అమలవుతుంది. అర్హతను బట్టి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుంది. దళారుల మాటలను నమ్మి మోసపోవద్దు.

– బొగ్గ నారాయణ, ఎంపీడీఓ, భద్రాచలం

రోడ్డుపైనే డంపింగ్



రోడ్డుకు ఇరువైపులా పోసిన కంకర, మట్టి కుప్పలు..

దమ్మపేట: డివైడర్ నిర్మాణ పనుల నిమిత్తం వినియోగించే ముడి పదార్థాలను రోడ్డుపైనే ఇరువైపులా కుప్పలు తెప్పలుగా డంపింగ్ చేయడంతో రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఇటీవల దమ్మపేట నుంచి మందలపల్లి వరకు రోడ్డు మధ్యలో నిర్మిస్తున్న డివైడర్ నిర్మాణం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. నిర్మాణంలో వినియోగించే ఇసుక, కంకర, ఫ్లెయాష్, సిమెంట్ మట్టి తదితర ముడి పదార్థాలను ఏదైనా ఖాళీ ప్రదేశంలో డంపింగ్ చేసుకుని, వాటిని అక్కడే తగిన మోతాదులో మిశ్రమంగా కలపాల్సి ఉంది. కానీ అందుకు విరుద్ధంగా, విచక్షణ రహితంగా వాటిని రోడ్డు పొడవున చిన్న కుప్పలుగా డంపింగ్ చేసి, రోడ్డుపైనే మిశ్రంగా కలుపుతున్నారు. ఈ కారణంగా రోడ్డు వెడల్పులో సగభాగం ముడి పదార్థాలతో ఉండగా, రెండు భారీ వాహనాలు ప్రయాణించడానికి వీలుగా ఉన్న రోడ్డు కేవలం ఒక్క వాహనానికి మాత్రమే సరిపోతుంది. దీంతోపాటు వాహనాలు ప్రయాణించినప్పుడు ఈ ముడి పదార్థాల దుమ్ము ధూళి గాలికి లేచి, వెనుకగా వస్తున్న ప్రయాణికులకు తీవ్రమైన ఇబ్బంది కలుగుతోంది. గత కొద్ది రోజుల కిందట ఇదే డివైడర్‌కు బైక్‌తో ఢీకొన్న యువకుడు చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఇలా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ గుత్తేదార్లు పూర్తి నిర్లక్ష్యంతో రోడ్డుపైనే ముడి పదార్థాలను కుప్పలుగా పోయడంపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ అధికారులు కూడా చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు తీవ్ర విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

చెక్‌డ్యాం పూర్తి చేయాలి



చెక్‌డ్యాం వివరాలను మ్యాప్‌లో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం: మండలంలోని బొజ్జికుప్ప గ్రామంలో నిర్మిస్తున్న చెక్‌డ్యాం పనులను త్వరితిగతిన పూర్తి చేయాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అధికారులను ఆదేశించారు. ఆదివారం బొజ్జికుప్ప గ్రామంలో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న చెక్‌డ్యాం పనులను ఆయన పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెక్‌డ్యాం నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని అలాగే త్వరగా పూర్తి చేసి రైతాంగానికి అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. అనంతరం పొలూరిపేట గ్రామంలోని తులసమ్మ చెరువును పరిశీలించి రైతులతో మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ సయ్యద్ అహ్మద్ జానీ, జేఈలు రాజ్‌సుహాస్, హర్ష రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మండలంలోని లక్ష్మీనగరం, చిన్ననల్లబల్లి, బండిరేవు గ్రామాలలోని సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆదివారం పంపిణీ చేశారు.అనారోగ్య భారీన పడి చికిత్స పొంది ప్రభుత్వం సహాయం కోరుతూ సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఎమ్మెల్యే సంబంధిత చెక్కులను బాధిత ఇళ్లకు వెళ్లి అందజేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, పార్టీ నాయకులు లంకా శ్రీనివాసరావు, మట్టా శివాజీ,అన్నె సత్యనారయణమూర్తి, నల్లపు దుర్గాప్రసాద్, బైరెడ్డి సీతారామరావు, శిరపు అప్పలరెడ్డి, సందీప్‌రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మతల్లి జాతర



పురవీధుల్లో అమ్మవారిని ఊరేగిస్తున్న గ్రామస్తులు..

దమ్మపేట: మండల పరిధిలోని మొద్దులగూడెం గ్రామంలో కొలువైయున్న పెద్దమ్మతల్లి జాతర మహోత్సవమును ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జాతరలో భాగంగా ఆలయంలో అమ్మవారిని ఘనంగా అలంకరించి, కలశ, కుంకుమ తదితర ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పురవీధుల్లో పెద్దమ్మ తల్లి ఉత్సవ విగ్రహాలను శోభయమానంగా ఊరేగించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మోరంపూడి వెంకటేశ్వరరావు, దొడ్డా భాస్కరరావు, స్వర్ణాల శ్రీనివాసరావు, మారేష్, సీతారామయ్య, గణపా రాము, కందుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అశ్వాపురం: మండల కేంద్రంలో ఆదిపరాశక్తి ఆలయం ఎదుట రోడ్డు ప్రమాదంలో ఆదివారం ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. మణుగూరుకు చెందిన ఓ వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా ఆలయం ఎదుట బైక్ అదుపు తప్పి కింద పడి గాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అతని వద్ద పెళ్లి శుభలేఖలు ఉన్నాయి. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తప్పుడు ప్రచారం నమ్మొద్దు

అశ్వారావుపేటరూరల్: ఆయిల్‌పాం రంగంలో టీఎస్ ఆయిల్‌ఫెడ్ కీలక పాత్ర పోషిస్తోందని, సంస్థపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ఆ సంస్థ జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయిల్‌పాం రైతులను ప్రోత్సహించేందుకు సాగులో మార్గనిర్దేశాలు, నాణ్యమైన మొక్కలను సబ్సిడీ కింద అందిస్తున్నామని అన్నారు. అలాగే దేశంలోని ఆయిల్ పాం ప్రాసెసింగ్ సంస్థలలో ఆయిల్‌ఫెడ్ అత్యధిక ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియా(ఓఈఆర్) 19.42శాతాన్ని సాధించిందని, తద్వారా అత్యధిక టన్ను ధర ఇస్తున్నట్లు వివరించారు. కాగా, కొన్ని ప్రైవేటు కంపెనీలు తక్కువ ఓఈఆర్ ఇవ్వడం కోసం తప్పుడు ప్రచారాన్ని కొంతమంది ద్వారా వ్యాప్తి చేస్తున్నారని, దీన్ని ఆయిల్‌ఫెడ్ సంస్థ పూర్తిగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రచారంతో నిబద్ధత ఉన్న ఉద్యోగులను నిరాశ పరిచేందుకు ప్రయత్నిస్తున్నట్లు అవేదన వ్యక్తం చేశారు. టీఎస్ ఆయిల్‌ఫెడ్ రైతులకు ఉన్నతమైన సేవలను అందిస్తోందని, తద్వారా ప్రైవేటు కంపెనీల లాభాలు తగ్గిన నేపథ్యంలో తప్పుడు ఆరోపణలు చేస్తూ, సంస్థను నిర్వీర్యం చేసే కుట్రలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. ఈ తప్పుడు, అసత్య ప్రచారాన్ని రైతులు నమ్మవద్దని ఈ సందర్భంగా కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



లబ్ధిదారుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

కరకగూడెం: మండల పరిధిలోని రేగళ్ల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇల్లులు వస్తాయని ఎవ్వరూ కూడా ఆందోళన చెందవద్దని మధ్యవర్తులను ఆశ్రయించవద్దని సూచించారు. అత్యంత పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని ప్రజా పాలనలో ప్రజల కష్టాలు తీర్చడమే తమ ముందున్న ఏకైక లక్ష్యంఅని అన్నారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో కలసి గ్రామంలోని ఓ వివాహ వేడుకలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, సర్పంచ్‌లు కుంజ వసంతరావు, తోలెం నాగేశ్వరరావు, నాయకులు ఎర్ర సురేష్, వజ్జ మహేష్, లక్ష్మీనారాయణ, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొర్రాజుల స్వామి తిరునాళ్లు ప్రారంభం

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వేదాంతపురం గ్రామంలో ఆదివారం రాత్రి నుంచి శ్రీ చిన్న కొర్రాజుల స్వామి వారి తిరునాళ్ల మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జాతర ఉత్సవాల నేపథ్యంలో గ్రామంలో స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. సోమవారం ఉదయం 8గంటలకు స్వామి వారి ఆలయ ప్రవేశం తర్వాత పూజలు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ తెలిపింది.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఒకే వేదిపై పూర్వ విద్యార్థులు

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనమయ్యారు. 2003-04 ఏడాది పదో తరగతికి చెందిన విద్యార్థులు సమావేశమైయ్యారు. రెండు దశాబ్దాల తరువాత కలుసుకున్న వీరందరూ అప్యాయంగా ఒకరినొకరూ హత్తుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఎవరు ఏం చేస్తున్నారో.. భార్య, పిల్లల యోగక్షేమాలు ఎలా ఉన్నాయో.. పరస్పరం అడిగి తెలుసుకున్నారు. నాటి ఉపాధ్యాయులైన బాబురావు, గౌరిశంకర్, ఎంవి.కోటాచారి, అటెండర్ వజ్రమ్మలను సన్మానించారు. మళ్లీ వచ్చే ఏడాది ఇక్కడే కలుసుకుందామని పరస్పరం చెప్పుకుని తిరుగు ప్రయాణమయ్యారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం!

- పత్తాలేని కొనుగోళ్లు
- తేమ శాతం, లారీల కొరత సాకులతో నిర్లక్ష్యం
- ఓ కేంద్రంలో దళారులకు విక్రయించిన అన్నదాతలు



కేంద్రంలో ఉన్న ధాన్యం వద్ద అన్నదాతల పడిగాపులు..



ఊట్లపల్లి కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యపు రాశులు

అశ్వారావుపేటరూరల్: ఆరుగాలం శ్రమించి అన్నదాతలు పండించిన ధాన్యం రాశులను రోజులు గడుస్తున్న కొనుగోలు చేయకపోడంతో ప్రభుత్వ ధాన్యం కేంద్రాల్లో భారీగా నిల్వలు పేరుకుపోతున్నాయి. తేమ శాతం, లారీల కొరత సాకుతో కేంద్రాల నిర్వాహకులు కాలయాపన చేస్తున్నారు. దీంతో దిక్కులేని రైతులు ఓ ప్రభుత్వ కొనుగోలు కేంద్రం వద్దే దళారులకు విక్రయించడం ఇక్కడ పరిస్థితి అద్దం పట్టుతుంది.

అశ్వారావుపేట మండలంలో ఇరవై రోజుల క్రితం అశ్వారావుపేట, ఊట్లపల్లి, అచ్యుతాపురం, జమ్మిగూడెం గ్రామాల్లో నాలుగు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిని అశ్వారావుపేట సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా, అదే రోజు నుంచి ఆయా కేంద్రాలకు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన రైతులు తాము పండించిన ధాన్యం రాశులను విక్రయాలకు తీసుకొచ్చారు. ఆయా కేంద్రాలకు ధాన్యం రాశులు తీసుకొచ్చి దాదాపు ఇరవై రోజులు కావొస్తుండగా, నేటికి(ఆదివారం) ఊట్లపల్లి కేంద్రం నుంచి ఒక్క బస్తా ధాన్యం కుడా కొనుగోలు చేయలేదు. దీంతో ఈ కేంద్రంలో సన్న రకం ధాన్యం 550 క్వింటాళ్లు, దొడ్డు రకం 1250 క్వింటాళ్లు నిల్వలు ఉండిపోయాయి. మూడు వారాలు కావొస్తున్న తేమ శాతం పేరుతో తమ ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని బాధిత రైతులు వాపోతున్నారు. అదే విధంగా అచ్యుతాపురం కేంద్రంలో రెండు రోజుల క్రితమే 230 క్వింటాళ్లు కొనుగోలు చేయగా, మరో 700 క్వింటాళ్లు నిల్వలు ఉన్నాయి. అశ్వారావుపేట కేంద్రంలో సన్న రకం ఇప్పటిదాకా 1250 క్వింటాలు కొనుగోలు చేయగా, మరో 800 క్వింటాళ్లు నిల్వలు ఉండగా, ఇక్కడ కుడా దొడ్డు రకం ధాన్యం ఒక్క బస్తా కుడా కొనలేదు. దీంతో ఈ కేంద్రంలో దొడ్డు రకం ధాన్యం 1200 క్వింటాలు నిల్వలు ఉన్నాయి. వీటిని రోజు ఆయా రైతులు కేంద్రానికి వచ్చి ఆరోబోసి రోజంతా నిరీక్షిస్తున్నారు.

ఆ కేంద్రంలో ధాన్యం దళారుల పాలు

మండలంలోని జమ్మిగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి దాదాపు 1200 క్వింటాళ్ల ధాన్యం రాగా, రెండు వారాలు దాటినా ధాన్యాన్ని కొనుగోలు చేయలేదు. కాగా, ప్రభుత్వం సన్న రకం ధాన్యం క్వింటాకు రూ.2320, అలాగే దొడ్డు రకానికి రూ.2300 రూపాయాలు మద్దతు ధర ఇస్తుండగా, కొనుగోలు కేంద్రం నిర్వాహకుల నిర్లక్ష్యం, తేమ, ఇతర సాకుల కారణంగా అగ్రహంతో అన్నదాతలు కొంతమంది దళారులకు ఆ కేంద్రం వద్దే విక్రయించడం గమనార్హం. ఇదే అదునుగా దళారులు ప్రభుత్వ మద్దతు ధరకు క్వింటాకు రూ.500 రూపాయాలను తగ్గించి కొనుగోలు చేయడంతో అన్నదాతల కష్టం దళారుల పాలైంది. దీంతో జమ్మిగూడెం కేంద్రం నుంచి ప్రభుత్వ కొనుగోలు కేంద్రం కొనుగోళ్లు జీరోగా నమోదు కావడం గమనార్హం. కాగా, కేంద్రాల నిర్వహకుడు రైస్‌మిలర్లు, దళారులతో కుమ్మక్కై కేంద్రాల్లో రోజుల తరబడి సాకుల పేరుతో ఆలస్యం చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులు, కురుస్తున్న ఆకాల వర్షాలతో ఆరుగాలం శ్రమించి కేంద్రాల్లో ఉంచి ధాన్యం తడిచి పోతుందనే ఆందోళన కలిగిస్తోందని పలువురు రైతులు వాపోతున్నారు. తక్షణమే కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లేని పక్షంలో ఆందోళనకు సిద్ధం అవుతామని రైతులు అంటున్నారు.

దిగుమతికి మిల్లర్లు నిరాకరణ

అశ్వారావుపేట కేంద్రం నుంచి శనివారం ఎట్టకేలకు ఒక లారీ(250 క్వింటాళ్లు) సన్న రకం ధాన్యాన్ని లోడు చేసి వినాయకపురం గ్రామంలోగల రైస్‌మిల్లుకు సొసైటీ సిబ్బంది పంపించారు. ఈ లారీ శనివారం సాయంత్రానికి వెళ్లగా, ఆదివారం ఉదయం సదరు మిల్లర్లు తమ టార్గెట్ పూర్తైందని దిగుమతికి నిరాకరించారు. దీంతో ఈ లారీ డ్రైవర్ ధాన్యం రైస్‌మిల్లు వద్దే దిగుమతి కోసం పడిగాపులు కాస్తున్నాడు. ఐనా సరే పట్టించుకునే నాథులే లేకుండా పోయారు.

తేమ శాతం లేకే ఆలస్యం

నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఒక్క కేంద్రం మినహా మిగిలిన కేంద్రాల్లో ధాన్యం రాశులు నిల్వ ఉన్నాయి. తేమ శాతం సరిపడా లేకపోవడంతోనే కొనుగోళ్లు ఆలస్యం అయ్యాయి. వాతావరణం రోజు రోజుకూ మారిపోవడంతోపాటు లారీలు లేకపోవడం కూడా కారణమే. దొడ్డు రకం ధాన్యం ఇప్పటి దాకా కొనుగోలు చేయలేదు. మరో రెండు రోజుల్లో నిల్వలన్నీ కొనుగోలు చేస్తాం.

– మానేపల్లి విజయబాబు, సీఈఓ, అశ్వారావుపేట సొసైటీ

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్నా ఏదేని ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గంట నుండి రాత్రి 8-00 గంట లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం ఎస్. లక్ష్మయ్య - 80742 70476
పినపాక ఎస్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎస్ దుర్గాప్రసాద్-9000327175. టోల్‌ఫ్రీ నెం.: 1800 2701083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చులతో కొంత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: ఎస్. నాగేశ్వర్, యాడ్స్ మేనేజర్- 99122 20600

యస్.రవిబాబు - 99516 02914
ఎస్. జయరాజు - 9652868642
కె. మధు - 97059 44416